సాక్షి
తిరుపతి
శనివారం। 24। ఆగస్టు। 2024



శాస్త్రం..సమగ్రం!
సంస్కృత వర్సిటీలో శాస్త్రాల సందేహాల నివృత్తి కేంద్రాలను ఈనెల 11వ తేదీన అట్టహాసంగా ఏర్పాటు చేశారు. - 8లో



న్యాయం చేయండి
శ్రీవారి మెట్టు మార్గంలో దుకాణాలు కోల్పోయిన బాధితులు డెప్యూటీ సీఎం ఎదుట తమ గోడు వెళ్లబోసుకున్నారు. - 8లో



జంట ఆత్మహత్య
ఓ జంట తిరుమల నుంచి శ్రీవారి మెట్టు మార్గంలో శ్రీనివాస మంగాపురానికి వస్తూ ఆత్మహత్యకు యత్నించారు. - 8లో

సమాజంలో మార్పు రావాలి



మహిళల విషయంలో సమాజంలో మార్పు రావాలి. ముఖ్యంగా ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల పట్ల ఇలాంటి క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. ప్రభుత్వాస్పత్రుల్లో పనిచేసే వైద్యులకు భద్రత కొరవడింది. ఆస్పత్రిలో మంచి వాతావరణం ఉంటే మహిళా వైద్యులు మరింత వేగంగా పనిచేస్తారు. అదే స్థాయిలో వైద్య సేవలందించేందుకు మానసికంగా బలంగా ఉంటారు. ఆ పరిస్థితులను కల్పించాలి. మహిళా వైద్యులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండేందుకు జాగ్రత్తలు తీసుకోవాలి.

- డాక్టర్ సుధారాణి, సీనియర్ వైద్యురాలు, తిరుపతి

జూడాల కమిటీ అవసరం



ప్రభుత్వాస్పత్రిలో భద్రత కల్పించే అంశంపై అక్కడే జూనియర్ డాక్టర్లతో ప్రత్యేక కమిటీ వేయాలి. భద్రతకు సంబంధించి వారి సూచనలు, సలహాలు తీసుకోవాలి. వారి ఆలోచనలకు అనుగుణంగా ప్రభుత్వాస్పత్రుల్లో భద్రతను కల్పించాలి. ప్రభుత్వం తక్షణం ఆ దిశగా ఆదేశాలు ఇస్తే వైద్యుల్లో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. ఆస్పత్రి ప్రాంగణాల్లో అసాంఘిక శక్తులు ఉండకుండా కఠినమైన చర్యలు తీసుకోవాలి. సెక్యూరిటీ వ్యవస్థను మరింత పెంచాలి. సీసీ నిఘాను బలోపేతం చేయాలి.

- డాక్టర్ వెంకటరమణ, జనరల్ సెక్రటరీ, ఐఎంఏ తిరుపతి శాఖ

భద్రత పెంచాలి



రాత్రివేళ ఏదైనా సీరియస్ కండీషన్‌ల్లో రోగులు వచ్చినప్పుడు చాలా జాగ్రత్తగా ప్రథమ చికిత్స అందించాలి. ఒక్క క్షణం ఆలస్యం అయినా ఒప్పుకోరు. వాళ్ల బాధను మేము అర్థం చేసుకుంటాం. కానీ అప్పటికే చాలా రసభ చేస్తారు. ఇంతకు మునుపు డాక్టర్లు, నర్సులపై భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు ఉన్నాయి. ప్రభుత్వం భద్రత పెంచి మాకు రక్షణ కల్పించాలి. మహిళా వాచ్‌మన్‌ను ఏర్పాటు చేయాలి. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలి.

- డాక్టర్ అనిత, పాండూరు పీహెచ్‌సీ ఇన్‌చార్జి

నష్టాల పాలు!



- జిల్లా వ్యాప్తంగా కుదేలైన పాడి రైతులు
- ఈనెల 21 నుంచి అమూల్ పాల సేకరణ నిలుపుదల
- రోజుకు 20వేల లీటర్ల పాలు నష్టం
- ఆ పాలన్నీ 'శ్రీజ'కి పోయాలని కూటమి నేతల హుకుం
- ఆ డెయిరీకి పోస్తే లీటర్‌పై రూ.11 వరకు నష్టం
- లబోదిబోమంటున్న పాడి రైతులు
- పట్టించుకోని అధికారులు, నేతలు

పాడి రైతుపై కూటమి నేతలు పగబట్టారు. ఇన్నాళ్లు సజావుగా సాగుతున్న పాడి పరిశ్రమను కుదేలు చేసేందుకు కంకణం కట్టుకున్నారు. తమ సంస్థకు కలిసొచ్చేలా హెరిటేజ్ అధినేత ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగానే ఇప్పుడు పోస్తున్న పాలన్నీ లీటరుపై రూ.11 తక్కువ ఇస్తున్న శ్రీజ పాల డెయిరీకి పోయాలని హుకుం జారీచేశారు. లేదంటే పాలెవరూ కొనరని, తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని పచ్చనేతల చేత ప్రచారం చేయించారు. విధిలేని పరిస్థితుల్లో కష్టాన్ని వదులుకుని.. పాలను నష్టానికి విక్రయించుకోవాల్సి వస్తోందని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కొత్తతిమ్మాపురంలో పాలు పోస్తున్న పాడిరైతు

జిల్లాలో పాడి రైతుల సమాచారం

పాడి రైతులు 20,820 మంది	పాల ఉత్పత్తులు లక్ష లీటర్లు
ఇతర డెయిరీలకు చెందిన పాడి రైతులు 18,500 మంది	ఇతర డెయిరీలకు ఇచ్చే పాల ఉత్పత్తులు 80 వేల లీటర్లు
అమూల్ పాడి రైతులు 2,320 మంది	అమూల్‌కు ఇచ్చే పాల ఉత్పత్తులు 20 వేల లీటర్లు

నెలకు రూ.10వేలు నష్టం



నా పేరు మంజుల. మాది నారాయణవనం మండలం, సముదాయం గ్రామం. నేను ఉదయం 5 లీటర్లు, సాయంత్రం 5 లీటర్లు పాలు అమూల్ సంస్థకు పోసేదాన్ని. లీటర్‌కు రూ.55 చొప్పున అమూల్ సంస్థ ఇచ్చేది. గతంలో లీటర్ రూ.35కే విక్రయించేవాళ్లం. ఈ లెక్కన నేను లీటర్‌కు రూ.25 చొప్పున రోజూ 10 లీటర్లకు రూ.250 అదనంగా పొందుతున్నాను. నెలకు రూ.7,500 అదనంగా వచ్చేది. ఇప్పుడు అమూల్ సంస్థ మూత వేయడంతో లీటర్ పాలు రూ.35కే పోయాల్సి వస్తోంది. నేను నెలకు రూ.7,500 నుంచి రూ.10 వేల వరకు నష్టపోతున్నా. చాలా బాధగా ఉంది.

మా నోటికాడ కూడు తీసేశారు



మాది పుత్తూరు మండలం, కొత్తతిమ్మాపురం గ్రామం. నా పేరు కే.మోహన్. మొన్నటి వరకు అమూల్ సంస్థ వారు లీటరు ఆవు పాలకు రూ.33 తగ్గకుండా ఇచ్చే వాళ్లు. వెన్న శాతం బాగుంటే అదే లీటరుకు రూ.45 వరకు వచ్చేది. ఇప్పుడు సంఘం కంపెనీ అంట..! లీటరు పాలకు రూ.23 నుంచి రూ.30 మాత్రమే ఇస్తున్నారు. దీంతో మేము చాలా నష్టపోతున్నాం. నేను రోజుకు 10 లీటర్ల పాలు పోస్తున్నా. లీటరుకు రూ.5 వంతున వేసుకొన్నా రోజుకు రూ.50 నష్టపోతున్నా. కూటమి ప్రభుత్వం వచ్చా మా నోటికాడ కూడు తీసేసినట్టయ్యింది. అధికారంలో ఎవరున్నా మా పొట్ట కొట్టొద్దని వేడుకుంటున్నా.

తిరుపతి అర్బన్ : పాడి రైతుల కడుపు కొట్టేందుకు కూటమి నేతలు సిద్ధమయ్యారు. గత ఏడాదిగా గిట్టుబాటవుతున్న పాల ధరను అమాంతం తగ్గించేందుకు కుట్రపన్నారు. ఇందులో భాగంగానే లీటరుకు రూ.70 వరకు ఇస్తున్న అమూల్ సంస్థకు పాలు పోయొద్దంటూ హుకుం జారీచేశారు. జిల్లాలోని 2,320 మంది రైతులు రోజుకు 20వేల లీటర్ల పాలు అమూల్ సంస్థకు పోస్తుండగా.. ఆ పాలన్నీ హెరిటేజ్‌కు అనుబంధంగా ఉన్న శ్రీజ పాల డెయిరీకి పోయాలని ఆదేశాలు జారీచేశారు. లేదంటే పాలు కొనేందుకు ఎవ్వరూ ముందుకు రారని పచ్చనేతల ద్వారా భయభ్రాంతులకు గురిచేశారు. ఈ క్రమంలో శ్రీజ పాలడెయిరీకి పాలు పోస్తే లీటరుకు రూ.11 వరకు నష్టమొస్తుందని పాడి రైతులు లబోదిబోమంటున్నారు. గత ప్రభుత్వంపై పగతో తమ పొట్టకొట్టడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

గతంలో నామమాత్రపు ధర

జిల్లాలో రెండు దశాబ్దాలుగా పాలకు నామమాత్రపు ధర చెల్లించేవారు. లీటర్‌కు రూ.34 నుంచి రూ.38 మాత్రమే చెల్లించేవారు. అయితే గత ప్రభుత్వం పాడి రైతును ఆదుకోవాలనే ఉద్దేశంతో అమూల్ సంస్థ ద్వారా పాల సేకరణకు శ్రీకారం చుట్టింది. తద్వారా లీటరు పాలకు గరిష్ఠంగా రూ.70 వరకు వచ్చేది. అమూల్ సంస్థ ద్వారా పాడి రైతుల అవసరాలకు భారీగా రుణాలు ఇప్పించింది. ఇందులో రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బ్యాంక్ రుణాలు ఇప్పించడంతో అప్పూసప్పూతీర్చుకునే వెసులుబాటు ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక పాడిపై పగబట్టి కుదేలు చేస్తోంది. హెరిటేజ్‌కు ఎక్కడ డిమాండ్ పడిపోతుందనే భయంతో అమూల్ సంస్థను అణగదొక్కుతోందని పాడి రైతులు ఆరోపిస్తున్నారు.



అమూల్ సంస్థకు పాలు పోస్తున్న పాడి రైతులు

గతంలో పాల ధరలు

గతంలో హెరిటేజ్‌తోపాటు పలు పాల డెయిరీలు ఒక్కో లీటరుకు ఒక్కో విధంగా రేటు నిర్ణయించి ఇచ్చేవారు. ప్రధానంగా ఆవు పాలకు లీటరకు రూ.28 నుంచి రూ.34 వరకు అందించేవారు. ఏ రోజు పాలు ధరలు ఆ రోజుకు లెక్కలు వేయకుండా 15 రోజులకు లెక్కలు వేసి సరాసరిగా ఇచ్చేవారు. దీంతో పాడి రైతులకు పెద్ద మొత్తంలో నష్టం వచ్చేది. పాల ద్వారా వచ్చే డబ్బులు పెట్టుబడులకే సరిపోయేది.

కలిసొచ్చిన అమూల్ పాల ధరలు

గత ప్రభుత్వం అమూల్ సంస్థను అందుబాటులోకి తీసుకొచ్చిన తర్వాత ఆవు పాలకు ప్రారంభంలో లీటర్ ధర రూ.45 నుంచి రూ.55కు పెరిగింది. గేదె పాలకు ప్రారంభంలో లీటర్ ధర రూ.65 నుంచి రూ.76 ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఇచ్చేవారు. ఆ తర్వాత లీటర్‌పై రూ.10 తగ్గించారు. అయితే ప్రతి పాడి రైతుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు బ్యాంక్ రుణాలు ఇప్పించేవారు.

అమూల్ పాల ప్రణాళిక ఇలా

ఏడాదిగా అమూల్ పాలు జిల్లాలో తొలి దశలో భాగంగా వడమాలపేట, పుత్తూరు, నారాయణవనం, ఎర్రావారిపాళెం, చిన్నగొట్టిగల్లు మండలాల్లో సేకరించారు. ఈ ఏడాది డిసెంబర్‌కు జిల్లాలో రెండో దశగా 19 మండలాల్లోను, 2025 మార్చికి మూడో దశగా 9 మండలాల్లో పాల కొనుగోలుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లాలోని 20,820 మంది పాడి రైతులకు న్యాయం చేయాలని భావించారు. ప్రస్తుతం జిల్లాలో వస్తున్న లక్ష లీటర్ల పాలతోపాటు మరో లక్ష లీటర్ల పాలు వచ్చేలా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

మండలాల వారీగా అమూల్ పాల సేకరణ

మండలం	పాడి రైతుల సంఖ్య	పాలు లీటర్లలో
చిన్నగొట్టిగల్లు	760	5,900
ఎర్రావారిపాళెం	678	5,300
పుత్తూరు	345	3,200
వడమాలపేట	295	2,950
నారాయణవనం	242	2,650
మొత్తం	2,320	20 వేల లీటర్లు

పశువులను అమ్ముకోవాల్సిందే



మాకు వేరే దారిలేదు. పశువుల కోసం చేసిన అప్పులను తీర్చడానికి మళ్లీ పశువులను అమ్ముకోవాల్సి వస్తోంది. అమూల్ సంస్థ ద్వారా పాలకు గిట్టుబాటు ధర వస్తోందని సంతోష పడ్డాం. ఇప్పుడు ఆ సంస్థను మూత వేయించడంతో పాడి రైతులకు కష్టాలు తప్పడం లేదు. ఇతర సంస్థలకు పాలు పోసినా గిట్టుబాటు ధర వస్తుందనే నమ్మకం లేదు. ప్రభుత్వం పాడి రైతులకు న్యాయచం చేయాలి.

-కె.హేమలత, జనగవనదపాళెం

మా బాధను అర్థం చేసుకోండి



ఈ ప్రభుత్వం పాడి రైతులపై పగబట్టింది. కొద్దోగొప్పో కోలుకుంటున్న సమయంలో మా నెత్తిన నిప్పులు పోసింది. అమూల్ సంస్థను మూతేసి నష్టానికి పాలు పోయమని ఆదేశిస్తోంది. ఇదెక్కడి న్యాయం. మార్కెట్లో దాణా, గడ్డి రేట్లు ఎలా ఉన్నాయి. ఇప్పుడు పాల ధర తగ్గిచ్చేస్తే ఎలా బతికేది. బ్యాంక్ రుణాలు కూడా తీర్చుకోలేం. మా బాధను అర్థం చేసుకోండి.

-పీ.వెంకటలక్ష్మి, చిన్నగొట్టిగల్లు

గత ప్రభుత్వం ఆదుకుంది



గత ప్రభుత్వం పాడి రైతులను ఆదుకుంది. ఒక్కొక్కరికీ రూ.లక్ష వరకు బ్యాంక్ రుణాలిచ్చి ప్రోత్సహించింది. మా బ్యాంకు ఖాతాల నుంచి నెలనెలా అసలు, వడ్డీ కింద డబ్బు కట్టేవాళ్లం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. బ్యాంకులకు మేము నేరుగా వెళ్లి కట్టాలి. గతంలో అమూల్ కంపెనీకి పాలు పోసేవాళ్లం. అప్పుడు లీటరు ఆవు పాలుకు రూ.33 నుంచి రూ.45 వరకు ఇచ్చే అవాళ్లు. అదే బర్రె పాలుకైతే రూ.80 వరకు ఇచ్చే వాళ్లు. ఇప్పుడు సంఘం కంపెనీ వారు ఒక లీటరుపై రూ.5 తగ్గించి తీసుకుంటున్నారు.

– పి.నందకుమార్, పాడిరైతు, కొత్తతిమ్మాపురం, పుత్తూరు మండలం

కమీషన్‌లోనూ కత్తెర



నేను కొత్తతిమ్మాపురంలో 15 ఏళ్లుగా మిల్క్ ఏజెంట్‌గా పనిచేస్తున్నాను. గత ప్రభుత్వంలో మా కమీషన్ కింద లీటరుకు రూ.2.5 ఇచ్చేవారు. ప్రస్తుతం దాన్ని రూ.1.1కు తగ్గించేశారు. విధిలేక ఏజెంటుగా కొనసాగుతున్నాను. నా వద్ద సుమారు 30 మంది పాలు పోస్తారు.

– పీ.ప్రతాప్, మిల్క్ ఏజెంట్, కొత్తతిమ్మాపురం, పుత్తూరు మండలం

న్యూస్‌రీల్

ప్రకాశం పంతులుకు ఘన నివాళి



జయంతి వేడుకల్లో జేసీ శుభం బన్సల్

తిరుపతి అర్బన్: స్వాతంత్ర్య సమరయోధుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శనీయులని జేసీ శుభం బన్సల్ కొనియాడారు. శుక్రవారం ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ సాధికార అధికారి చంద్రశేఖర్, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాలో 774 చోట్ల గ్రామసభలు

తిరుపతి అర్బన్: జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఒక్కరోజే 774 పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. అధికారుల కొరత నేపథ్యంలో 495 చోట్ల మాత్రమే ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ నారాయణవనం, వడ్డిపాళెంలో చేపట్టిన గ్రామసభల్లో పాల్గొన్నారు. చాలా చోట్ల కూటమి నేతలకు హోదా లేకున్నా దర్జాగా వేదికపై కూర్చుని అధికారులతో ముచ్చటించడం కనిపించింది. పలు గ్రామ సభల్లో పనులు కల్పించాలంటూ స్థానికులు పట్టుబట్టడం గమనార్హం.

పౌష్టికాహారానికి మంగళం

- అంగన్‌వాడీలకు కందిపప్పు కట్
- అవస్థల్లో గర్భిణులు, బాలింతలు, పిల్లలు

తిరుపతి అర్బన్: కొత్త ప్రభుత్వం కొలువుదీరిన వెంటనే సంక్షేమ పథకాలకు మంగళం పాడేస్తోంది. ఎప్పటి నుంచో అంగన్‌వాడీ పాఠశాలల పిల్లలు, గర్భిణులు, బాలింతల పౌష్టికాహారం కోసం అందిస్తున్న కంది పప్పును ఈ నెలకు ఇవ్వకుండా పంగనామాలు పెట్టేసింది. అరకొర సరుకులు రావడంతో కొన్ని పాఠశాలలకే కంది పప్పు పంపాల్సి వచ్చింది.

గతంలో పకడ్బందీగా వైఎస్సార్ సంపూర్ణ పోషణ

గత ప్రభుత్వం వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకం పేరుతో గర్భిణులు, బాలింతలకు 15 రోజులకు ఒకసారి పౌష్టికాహారం పంపిణీ చేసేది. ఈ పథకం కింద గర్భిణులు, బాలింతలకు కిట్లు రూపంలో సరుకులు అందించేవారు. నెలకు సరిపడా బియ్యం 3 కిలోలు, కంది పప్పు కిలో, ఆయిల్ అరకిలో, రాగిపిండి 2 కిలోలు, అటుకులు కిలో, ఖర్జూరం పావు కేజీ, చిక్కీలు పావుకేజీ, బెల్లం పావుకేజీ, పాలు 5 లీటర్లు, 25 గుడ్లు చొప్పున ఇచ్చేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక బాలసంజీవిని పేరుతో సరుకులు అందిస్తామని చెప్పి చేతులెత్తేసింది.

లక్షల మందికి గండి

జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలింతలు, గర్భిణులు, పిల్లలు మొత్తం 1.46 లక్షల మంది ఉన్నారు. వీరందరికీ పౌష్టికాహారంలో భాగంగా కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. దశాబ్దాల తరబడి ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా తమకు ఇవ్వాల్సిన సరుకులు ఇచ్చేవారని, అయితే టీడీపీ కూటమి ప్రభుత్వం ఇలా తమ పొట్టకొట్టడం బాధగా ఉందని పలువురు ఆవేదన చెందుతున్నారు.



జిల్లా సమాచారం

అంగన్‌వాడీ పాఠశాలలు- 2,492
పిల్లలు, గర్భిణులు, బాలింతలు - 1,46,669

కొందరికే కందిపప్పు ఇచ్చాం



జిల్లాలోని 2,492 పాఠశాలలుండగా వీటన్నింటికీ కందిపప్పు ఇవ్వాల్సి ఉంది. అయితే సరుకులు తక్కువగా వచ్చిన నేపథ్యంలో 1,455 స్కూల్స్‌కు మాత్రమే కందిపప్పు పంపిణీ చేశాం. మిగిలిన సరుకులు క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పంపిణీ చేస్తున్నాం.

-జయలక్ష్మి,
మహిళాశిశు సంక్షేమ జిల్లా అధికారిణి

28న ఇంటర్వ్యూలు

తిరుపతి అర్బన్: సూళ్లూరుపేటలోని ఎస్‌వీఎస్ గవర్నమెంట్ డిగ్రీ కళాశాలలో ఈనెల 28న బ్లూస్టార్ క్లైమేటిక్ ఇండియా లిమిటెడ్‌లో ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి ఆర్.లోకనాథం తెలిపారు. ఐటీఐ, డిప్లొమో, బీటెక్ ఉత్తీర్ణులై, 18 నుంచి 25 ఏళ్ల లోపు ఉన్న యువతీ, యువకులు అర్హులన్నారు. పదో తరగతి, డిగ్రీ చదువుకున్న 18–30 ఏళ్ల లోపు వారు ప్రొడక్షన్ హెల్పర్లుగా పని చేయడానికి అవకాశం కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఆసక్తి గల వారు ఇంటర్వ్యూలకు హాజరుకావాలని కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

స్కిల్ కోర్సు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉన్న స్కిల్ హబ్ సెంటర్‌లో స్కిల్ కోర్సును త్వరలో ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా అసిస్టెంట్ టెక్నీషియన్ కంప్యూటర్ హార్డ్‌వేర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. 210 గంటల కాలవ్యవధి ఉన్న ఈ కోర్సుకు పదో తరగతి, ఆపై విద్యార్హత కలిగి ఉండాలని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 90009 57055 నంబరుకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

పురిటి బిడ్డ తిరుపతికి తరలింపు



పురిటి బిడ్డను సీడీపీఓ ఉమామహేశ్వరికి అప్పగించిన ప్రభుత్వ వైద్యురాలు రూప

నాయుడుపేట టౌన్: నాయుడుపేట పట్టణ సమీపంలో ఓజిలి మండల, జ్యోష్యులవారికం డ్రిగ గ్రామ వద్ద వదిలివెళ్లిన పురిటి బిడ్డకు స్థానిక ప్రభుత్వాస్పత్రిలో రెండు రోజుల పాటు వైద్యసేవలందించారు. అనంతరం శుక్రవారం సాయంత్రం బిడ్డను స్థానిక ప్రభుత్వ వైద్యురాలు రూప, ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరికి అప్పగించారు. ఆమె పీడీ జయలక్ష్మి సారథ్యంలో తిరుపతి జిల్లా కేంద్రంలో ఉన్న శిశు సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లి అక్కడి మేనేజర్ లక్ష్మీకుమారికి అప్పగించారు.

30, 31 తేదీల్లో రాగి రేకుల టెండర్ కమ్ వేలం

తిరుపతి(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లోని హుండీ ద్వారా భక్తులు సమర్పించిన కాపర్ - 2, సిల్వర్ కోటెడ్ రాగి రేకులను ఈనెల 30, 31వ తేదీల్లో టెండర్ కమ్ వేలం (ఆఫ్‌లైన్) వేయనున్నట్లు టీటీడీ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 30న కాపర్ -2 (3000 కేజీలు)-15 లాట్లు, ఈనెల 31వ తేదీన సిల్వర్ కోటెడ్ రాగి రేకులు (2,400 కేజీలు)-12 లాట్లు వేలానికి ఉంచినట్టు పేర్కొన్నారు.

కెమెరాల వేలం

శ్రీవారి ఆలయంతోపాటు అనుబంధ ఆలయాల్లో భక్తులు హుండీల ద్వారా సమర్పించిన ఉపయోగించిన/పాక్షికంగా దెబ్బతిన్న కెమెరాలు మొత్తం 6 లాట్లను ఈ నెల 28న టెండర్ కమ్ వేలం వేయనున్నట్టు వెల్లడించారు. వివరాలకు తిరుపతిలోని హరేరామ హరేకృష్ణ రోడ్డులోని టీటీడీ మార్కెటింగ్ కార్యాలయంలో కాని, 0877-2264429లో కార్యాలయ పని వేళలు, టీటీడీ వెబ్‌సైట్ www.tirumaa.orf లో సంప్రదించాలని కోరారు.

వంట గదిలో అగ్నిప్రమాదం

ఓజిలి: ఓజిలి ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాలలోని వంటగదిలో శుక్రవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. పోలీసులు వివరాలు.. మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు అనుషా పిల్లలకు వంట చేస్తోంది. భోజనం తయారు చేసిన అనంతరం ఎగ్‌ఫ్రై చేస్తున్న క్రమంలో బాండలికి(పాన్) గ్యాస్ మంట అంటుకుంది. దీంతో ఒక్కసారిగా వంట గదిలో మంటలు వ్యాపించాయి. అనంతరం గ్యాస్ పైపు కూడా లీకై మరింతగా మంటలు ఎగసిపడడంతో దట్టమైన పొగ కమ్మేసింది. పాఠశాలలోని ఉపాధ్యాయులు నారాయణ, రవికుమారి వెంటనే స్పందించి విద్యార్థులు 24 మందిని బయటకు తీసుకెళ్లారు. అనంతరం ఎంఈఓ శైలజాకు సమాచారం ఇచ్చారు. అనంతరం ఎంఈఓ ఎస్ఐ రవిబాబుతో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఎస్ఐ వంటగదిలోకి ధైర్యంగా వెళ్లి గ్యాస్ సిలిండర్ రెగ్యులేటర్‌ను అదుపుచేశారు.

రక్షణ పెంచాలి



ప్రభుత్వాస్పత్రుల్లో జూనియర్, సీనియర్ మహిళా వైద్యులు రాత్రివేళల్లో విధులు నిర్వర్తించేటప్పుడు తగిన భద్రత కల్పించాలి. మహిళా పోలీసులను వైద్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలి. అనుమానాస్పద వ్యక్తులు గానీ, మత్తుపదార్థాలు సేవించి, ఆస్పత్రిలోకి వచ్చేవారిని గుర్తించి, కఠిన చర్యలు తీసుకోవాలి. రక్షణ చర్యలు కల్పిస్తేనే సంపూర్ణంగా వైద్యసేవలు అందించొచ్చు.

–ఎస్. మానస, వైద్యురాలు, సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాల

మనోధైర్యం నింపేలా చట్టాలు



మహిళా వైద్యులపై ఏదో ఒక ప్రాంతంలో దాడులు జరుగుతుండడం బాధాకరం. వీటిని అరికట్టేందుకు అనుగుణంగా ప్రభుత్వాలు చట్టాల్లో మార్పులు తేవాలి. పటిష్టంగా అమలు చేయడానికి తగిన వ్యవస్థలను రూపొందించాలి. పల్లెటూళ్లలో విధులు నిర్వహిస్తున్న వైద్యులకు మనోధైర్యం నింపేలా చట్టాలను కఠినతరం చేయాలి. రాత్రి సమయాల్లో సేవలు అందిస్తున్న డాక్టర్లకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలి. – ఏజీ ప్రేమ, డెంటల్ అసిస్టెంట్, కమ్యూనిటీ వైద్యశాల సత్యవేడు

ఆడపిల్లగా పుట్టడం నేరమా?



రోజూ డాక్టర్లపై జరిగే దాడులు దిన పత్రికల్లో చదువుతుంటే భయమేస్తోంది. మేం తిరుపతిలో ఉంటాం. మా కుమార్తె డాక్టర్‌గా విధులు నిర్వహిస్తూ పాందూరులో ఉంటోంది. పిల్లలు ఉద్యోగాలు చేసుకుని, ఉన్నతి స్థితికి చేరాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. పది మందికీ ప్రాణాదానం చేస్తున్న మహిళా డాక్టర్లకు రక్షణ కరువైంది. ప్రభుత్వం మహిళా వైద్యులకు రక్షణకు చర్యలు తీసుకోంటే మేలు.

–పి.ధనలక్ష్మి, తిరుపతి

శాస్త్రం.. సమగ్రం!

గృహ ప్రవేశాలు, నూతన భవన నిర్మాణలకు భూమిపూజ, వాస్తు, భవిష్యత్‌ను తెలిపే జ్యోతిష్యం, కొత్త వాహనాల కొనుగోలు, నూతన వధూవరుల పేరు ఫలాలు, గణాంకాలు, వివాహాది శుభకార్యాలు, అమృత ఘడియలు, పుట్టిన జన్మ నక్షత్రం సందేహాలు, దేవాలయాల నిర్మాణం, కైంకర్యాలు, విగ్రహాల ప్రతిష్ట వంటి సందేహాల కోసం ఎంతో మంది పూజారులు, పౌరోహితుల కోసం వెదుకులాడుతుంటారు. భారీగా ఖర్చుపెట్టుకుని సుదూర ప్రాంతాలకు వెళ్తుంటారు. అటువంటి వారికోసం అన్ని శాస్త్రాల సమగ్ర సమాచారం పూర్తి స్థాయిలో అందించేందుకు తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీ సరికొత్త కన్సల్టెన్సీ కేంద్రాలను ప్రారంభించింది. వాటిని అతి సామాన్యులకు చేరువ చేయాలనే లక్ష్యంతో అడుగులు వేస్తోంది. అవేంటో మీరే చదవండి.

- సంస్కృత వర్సిటీలో శాస్త్రాల సందేహాలపై నివృత్తి కేంద్రాలు
- దేశంలోనే ప్రప్రథమంగా వర్సిటీలో ఏర్పాటు
- ఆగమ, వాస్తు, జ్యోతిష్యం, పౌరోహిత్యం, యోగా కన్సల్టెన్సీ కేంద్రాలు
- శాస్త్రజ్ఞానాన్ని అందించడమే లక్ష్యం
- పురాణాలు, శాస్త్రాల పరిచయ నిఘంటువుగా వర్సిటీకి గుర్తింపు
- ప్రజలు వినియోగించుకోవాలంటున్న అధికారులు, అధ్యాపకులు



వాస్తు శాస్త్ర నివృత్తి కేంద్రం వద్ద సందేహాలను నివృత్తి చేస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ: దేశంలో ఏకైక కౌన్సెలింగ్ అండ్ కన్సల్టెన్సీ సెంటర్లను జాతీయ సంస్కృత వర్సిటీలోని నైమేశారణ్య ప్రాంగణంలో ఈ నెల 11న వర్సిటీ వీసీ ఆధ్వర్యంలో ప్రారంభించారు. శని, ఆదివారాలు మినహాస్తే సోమవారం నుంచి శుక్రవారం వరకు ఉదయం 9 నుంచి 10గంటల వరకు, తిరిగి సాయంత్రం 5 నుంచి 6గంటల వరకు ఈ కేంద్రాలు పనిచేస్తాయి. ప్రజలు రూ.51 నామమాత్రపు ఫీజుతో తమ సమస్యలను నివృత్తి చేసుకోవచ్చు.

ఆగమ శాస్త్ర సమస్యలపై నివృత్తి కేంద్రం

ఆలయాల్లో చేసే పూజా విధానం, ఉత్సవాలు, అర్చనలో జరిగే దోషాలను నివారించేందుకు సూచనలు, స్వామివారి వాహన సమయంలో తీసుకోవాల్సిన శాస్త్ర పరమైన నిబంధనలు, దేవుళ్ల విగ్రాహాలు తొలగిస్తే జరిగే పరిణామాలు, ఆనందనిలయ విమాన ఎత్తు, మూలవిరాట్ ప్రతిష్ట, గోపురం ఎత్తు కొలతలు, కొత్త ఆలయాల నిర్మాణం, పోటు, ఆలయ శుద్ధి, ఆలయ భూములు, వాహనం ఎత్తు, విగ్రహాల ప్రతిష్ట, యాగశాల వంటి విషయాలపై సమాచారాన్ని పొందవచ్చు.

జ్యోతిష్య శాస్త్ర కన్సల్టెన్సీ కేంద్రం



వర్సిటీలో ప్రత్యేకంగా నిపుణులైన జ్యోతిష్య పండితులచేత ప్రజల సమస్యలను నివృత్తి చేసేందుకు కన్సల్టెన్సీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా వధూవరుల జాతకాలు, విద్య, ఉద్యోగ ప్రాప్తి, మానవుని భవిష్యత్ కార్యాచరణలో ఎదుర్కొనే సమస్యలను పసిగట్టడం, సమస్యల పరిష్కార మార్గాలను చూపడం, పేరుఫలాలు, నామకరణాలు, అక్షరాభ్యాసం, గ్రహాల దోషనివారణ కోసం శాంతి పూజలు, యజ్ఞాల బలం వంటి అంశాలపై రోజూ నివృత్తి చేస్తున్నారు.

వాస్తు శాస్త్ర సమస్యలకు పరిష్కారం

గృహ నిర్మాణం, నూతన భూముల క్రయవిక్రయాలు, ఇంటిలోపల ద్వారం, వంటశాల, బెడ్ రూమ్, హాల్, దేవుని గది ఏ ప్రాంతంలో ఏర్పాటు చేసుకోవాలనే విషయాలపై సమాచారం అందిస్తున్నారు.

పౌరోహిత్యం, అర్చకత్వం కోసం ప్రత్యేక సెంటర్



పౌరోహిత్యంపై విద్యార్థులకు, పండితులకు, ప్రజలకు ఏర్పాడే సందేహాలను నివృత్తి చేసుకునేందుకు వర్సిటీలో ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో ప్రధానంగా అర్చన ఎలా చేయాలి, వ్రతాల ప్రధానంతో పాటు వత్రాలు ఏసమయంలో చేస్తే మేలు జరుగుతుంది, దేవాతామూర్తులను పూజించే పద్ధతులు, కర్మకాండకు సంబంధించిన విశేషాలు, సందేహాలు ప్రతినిత్యం పరిష్కరించేందుకు అధ్యాపకులు, నిపుణులు వర్సిటీలో అందుబాటులో ఉంటారు.

యోగాసనాలపై ప్రత్యేక కేంద్రం

యోగాసనాల ఉపయోగాలు, సందేహాలపై ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశారు. ఇందులో నడుం నొప్పి, కీళ్ల వాపులు, జలుబు, మానసిక సమస్యలు వంటి వాటిని నివారించడానికి ప్రత్యేక ఆసనాలను నేర్పిస్తున్నారు. గర్భిణులకు సుఖప్రసవంతో పాటు మానసిక, శరీరక రుగ్మతలను తొలగించేందుకు ప్రత్యేక ఆసనాలను నేరిప్పించేందుకు అధ్యాపకులు సిద్ధంగా ఉన్నారు. అయుష్షు పెంచే ఉపాయాలు, ప్రాణయాణం, వృద్ధులకు యోగాసనాలు వంటి పలు రకాల



యోగాసనాలను నేర్చుకునేందుకు వర్సిటీ అవకాశం కల్పించింది.



ఆగమశాస్త్ర సందేహాలను నివృత్తి చేస్తున్న దృశ్యం

సందేహాల నివృత్తి



ప్రజలకు వాస్తు శాస్త్రంపై అవగాహన అవసరం. గృహ నిర్మాణాలు, భూమి పూజ, భవన నిర్మా ణాల్లో తీసుకోవల్సిన జాగ్రత్తలను వాస్తు శాస్త్రం ప్రజలను అప్రమత్తం చేస్తుంది. నూత న గృహాల నిర్మాణం, గృహోపకరణాల స్థానం వంటి విషయాలపై ఉండే సందేహాలనునివృత్తి చేస్తాం. –ప్రొఫెసర్ క్రిష్ణేశ్వర్ ఝా, హెచ్ఓడీ, వాస్తు శాస్త్ర విభాగం, కన్సల్టెన్సీ కేంద్ర ఇన్‌చార్జి, ఎస్ఎస్‌యూ

పౌరోహిత సమస్యల పరిష్కారం



పౌరోహిత, అర్చక శాస్త్రాలలో సందేహాలను పరిష్కరించేందుకు సరైన వేదిక వర్సిటీలోని కర్మకాండ కన్సల్టెన్సీ కేంద్రం. జాతీయ సంస్కృత వర్సిటీలో ప్రజలకు శాస్త్రాలను చేరువ చేసే ప్రధాన ఉద్దేశంతో నివృత్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం శుభపరిణామం.

–ఎంఏ అవధాని, కర్మకాండ విభాగ అధ్యాపకులు, కన్సల్టెన్సీకేంద్ర ఇన్‌చార్జి, ఎస్ఎస్‌యూ

అదే మా లక్ష్యం



సామాన్య ప్రజలకు పలు శాస్త్రాలలోని జ్ఞానం అందించాలనే ఉద్దేశంతో వర్సిటీలో కన్సల్టెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇందుకోసం ప్రజలకు నిత్యం అవసరమైన ఐదు శాస్త్రాల కేంద్రాలలో నిపుణులైన అధ్యాపకులను నియమించి సందేహాల నివృత్తి చేస్తున్నాం. నగర ప్రజలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-జీఎస్ఆర్ కృష్ణమూర్తి, వీసీ. జాతీయ సంస్కృత వర్సిటీ

ప్రజలు ఉపయోగించుకోవాలి



వర్సిటీలో ఆగమ, జ్యోతిష్యం, యోగా, వాస్తు, పౌరోహిత్యం వంటి శాస్త్రాలలో కలిగే సందేహాలను సామాన్య ప్రజలకు అందిస్తున్నాం. కన్సల్టెన్సీ కేంద్రాలను ఏర్పాటు చేసిన అనతి కాలంలోనే మంచి స్పందన వస్తోంది. ఇతర జిల్లాల నుంచి సైతం ప్రజలు వర్సిటీకి వచ్చి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు.

–ప్రొఫెసర్ వీఎస్ విష్ణు బట్టాచార్యులు, అకడమిక్, కన్సల్టెన్సీ కేంద్రాల ఇంచార్జ్, ఎస్ఎస్‌యూ

అసత్యాలకు తావుండదు



వర్సిటీలో ఏర్పాటు చేసిన జ్యోతిష్య శాస్త్ర సందేహాల నివృత్తి కేంద్రంలో స్వచ్ఛమైన, నిజమైన జ్యోతిష్యం అందిస్తున్నాం. ప్రస్తుతం సమాజంలో అనాథరైజ్డ్ జ్యోతిష్య కేంద్రాలు వేల సంఖ్యలో ఉన్నాయి. అవి లాభాపేక్షతో పనిచేస్తున్నాయి. యూజీసీ గుర్తింపు పొందిన వర్సిటీలో అసత్యాలకు తావు ఉండదు. నిశితంగా పరిశీలించి అధ్యయనం చేసి కచ్చితత్వానికి దగ్గరగా జ్యోతిష్యం ఉంటుంది.

-ప్రొఫెసర్ ఆర్‌కే ఠాకూర్, మాజీ వీసీ, జ్యోతిష్య శాస్త్ర కన్సల్టెన్సీ కేంద్రం ఇన్‌చార్జి, ఎస్ఎస్‌యూ

సంపూర్ణ ఆరోగ్యం



సాధారణ ప్రజలకు యోగాను పరిచం చేయడం, వారి ఆరోగ్య సంరక్షణలో ప్రధాన భూమిక పోషించే ఆసనాలను సూచించడమే యోగా కన్సల్టెన్సీ కేంద్రం ప్రధాన లక్ష్యం. వర్సిటీలో నిపుణులైన అధ్యాపకులు ఉన్నారు.

–డాక్టర్ లక్ష్మీనారాయణ, యోగా విభాగాధిపతి, కన్సల్టెన్సీ కేంద్ర ఇన్‌చార్జి, సంస్కృత వర్సిటీ

సేవ్ మై జాబ్

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు వినతి పత్రం అందించిన మద్యం షాపు సిబ్బంది



కట్టపుట్టాలమ్మ ఆలయం వద్ద నిరసన తెలుపుతున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

రేణిగుంట: 'ఐదేళ్లుగా ప్రభుత్వ మద్యం షాపుల్లో కనీస వేతనానికి పని చేశాం.. ప్రస్తుతం షాపులను ప్రభుత్వం ఎత్తేసి ప్రైవేటు భక్తులకు అనుమతులిస్తున్న పరిస్థితుల్లో మాకు ఉద్యోగ భద్రత కల్పించాలి' అని జిల్లాలోని మద్యం షాపుల్లో పనిచేస్తున్న సిబ్బంది రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు వినతిపత్రాన్ని అందించారు. శుక్రవారం రేణిగుంట విమానాశ్రయం నుంచి అన్నమయ్య జిల్లాకు రోడ్డు మార్గాన వెళుతున్న పవన్ కళ్యాణ్ కాన్వాయ్‌ను రేణిగుంట కట్ట పుట్టాలమ్మ గుడి వద్ద ప్రభుత్వ మద్యం షాపులో పనిచేస్తున్న సిబ్బంది ఆపారు. తమ ఉద్యోగాల విషయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు, ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర ఎలాంటి స్పష్టత ఇవ్వలేదన్నారు. వారి నుంచి వినతిపత్రాన్ని స్వీకరించిన పవన్‌కల్యాణ్ సీఎంతో చర్చించి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.



డెప్యూటీ సీఎంకు సమస్యను వివరిస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాల సిబ్బంది

న్యాయం చేయండి

20 ఏళ్లుగా 31 కుటుంబాలు శ్రీవారి మెట్టు మార్గంలో చిన్నపాటి దుకాణాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నామని, అయితే పులి నెపంతో తమ దుకాణాలను తొలగించి కిందకు దించేశారని, తమకు న్యాయం చేయాలని బాధితులు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు విన్నవించారు. రేణిగుంట కట్ట పుట్టాలమ్మ గుడి వద్ద వారు పవన్‌కల్యాణ్‌ను కలిశారు. తమను ఆదుకోవాలని వారు ఆయనకు విన్నవించగా, టీటీడీ అధికారులతో మాట్లాడి సమ స్య పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అంతకుముందు శ్రీవారి మెట్టు వ్యాపారులు సీఐటీయూ సహకారంతో మూడవ రోజు తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం వద్ద శ్రీవేంకటేశ్వర స్వామి ఫొటోలను నెత్తిన పెట్టుకుని ఒంటికాలిపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు.

1న సీపీఎస్ ఉద్యోగుల సదస్సు

తిరుపతి కల్చరల్: ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 1న విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సీపీఎస్ ఉద్యోగుల సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ సీపీఎస్ ఎంప్లాయీస్ అసోసియేట్ అధ్యక్షుడు చీర్లకిరణ్ పిలుపు నిచ్చారు. ఉద్యోగులకు తీవ్రం నష్టం కలిగించే సీపీఎస్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. తాము అధికారంలోకి వస్తే ఏడాదిలోపు సీపీఎస్‌ను రద్దు చేస్తామని జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని, ఈ నేపథ్యంలో తలపెట్టిన సదస్సులో భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. అసోసియేషన్ నేత వంకీపురం పవన్, ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్‌ను నియమించండి

తిరుపతి మంగళం : ఆంధ్రప్రదేశ్ వెల్‌నెస్ సెంటర్ల పర్యవేక్షణ, పరిపాలన, కార్యకలాపాల కోసం రాష్ట్రానికి ప్రత్యేక అడిషనల్ డైరెక్టర్‌ని నియమించాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం ఢిల్లీలో ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ రోలోసింగ్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రాల పునర్విభజన తర్వాత కూడా వెల్‌నెస్ సెంటర్లను తెలంగాణ రాష్ట్రానికి చెందిన సీజీహెచ్ఎస్ హైదరాబాద్ అడిషనల్ డైరెక్టర్ నియంత్రణ, పర్యవేక్షణలోనే ఉన్నాయని ఆమెకి వివరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఇప్పటికే ఐదు నగరాలలో సీజీహెచ్ఎస్ వెల్‌నెస్ సెంటర్లు ఉన్నాయని, కొత్తగా తిరుపతి నగరంలో వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు కానుందని ఆమెకి దృష్టికి తీసుకెళ్లారు. వెల్‌నెస్ సెంటర్లలో మొత్తం 23,326 మంది కార్డ్ హోల్డర్లు ఉన్నారని, 56,951 లబ్ధిదారులుగా నమోదు చేసుకున్నారని, పదవీ విరమణ కారణంగా లబ్ధిదారుల సంఖ్య మరింత పెరుగుతోందని ఆయన వివరించారు.



వినతి పత్రం అందజేస్తున్న ఎంపీ

గ్రామాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం

నారాయణవనం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. నారాయణవనంలో శుక్రవారం సర్పంచ్ శారదాగణేషన్ అధ్యక్షతన ఉపాధి హామీ పథకం కింద చేపట్టాల్సిన పనులను గుర్తించేందుకు గ్రామసభ నిర్వహించారు. ఇందులో సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి కుటుంబానికీ మరుగుదొడ్డి, తాగునీరు, విద్యుత్, గ్యాస్ కనెక్షన్ సౌకర్యాలు ఉండాలన్నారు. గ్రామ స్థాయిలో తాగునీటి పంపులు, బోరుబావులు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, నిర్మించాల్సిన మురుగు కాలువలు, సీసీరోడ్ల వివరాలను సేకరించి, నివేదికలను సిద్ధం చేయాలన్నారు. పాఠశాలలు, శ్మశానవాటికలు, పొలాలకు దారుల ఏర్పాటు, చెరువుల పూడికతీత ఏర్పాటును గుర్తించి ఉపాధి హామీ కింద పనుల మంజూరుకు నివేదికలు సిద్ధం చేయాలన్నారు.

కల్వర్టు నిర్మాణానికి భూమి పూజ

నారాయణవనం, భీమునిచెరువు రోడ్డులో కల్వర్టు నిర్మాణానికి ఎమ్మెల్యే ఆదిమూలం, కలెక్టర్ వెంకటేశ్వర్, ఇరిగేషన్ ఈఈ మదన్‌గోపాల్ భూమి పూజ చేశారు. మండలంలోని రెండు కల్వర్ట్‌లతో పాటు మరో నాలుగు సీసీ రోడ్ల పనులను మరో రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు.

జంట ఆత్మహత్యాయత్నం

- 19 ఏళ్ల యువకుడితో వివాహితకు స్నేహం
- తిరుమల నుంచి కాలినడకన వస్తూ పురుగుల మందు తాగిన జంట

చంద్రగిరి : పాతికేళ్ల వివాహిత.. 19 ఏళ్ల యువకుడితో స్నేహంగా ఉంటోంది. ఆ ఇద్దరూ మూడు రోజుల క్రితం తిరుమలకు వెళ్లారు. శుక్రవారం కాలినడకన శ్రీనివాసమంగాపురానికి వస్తూ మార్గం మధ్యలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు.. చిత్తూరు సమీపంలోని కొంగారెడ్డిపల్లికి చెందిన రాధిక(25) భర్త, ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తోంది. అదే గ్రామానికి చెందిన సతీష్(19)తో కొంత కాలం కిందట పరిచయం ఏర్పడింది. ఆ ఇద్దరూ మూడు రోజుల కిందట ఇంటి నుంచి ఎవరికీ చెప్పకుండా తిరుమలకు వెళ్లారు.





అపస్మారక స్థితిలో ఉన్న సతీష్, రాధిక

శుక్రవారం శ్రీవారి దర్శనానంతరం ఇద్దరూ శ్రీవారి మెట్టు మార్గం నుంచి కాలినడకన వస్తూ మార్గ మధ్యలో వెంట తెచ్చుకున్న పురుగుల మందును తాగి ఆత్మాహత్యాయత్నానికి పాల్పడ్డారు. భక్తులు గమనించి.. టీటీడీ విజిలెన్స్ అధికారులకు సమాచారం ఇచ్చారు. రాధిక భర్త విజయ్‌తో పాటు సతీష్ బంధువులకు సమాచారం అందించారు. వారు శ్రీవారిమెట్టు వద్దకు చేరుకుని వారిద్దర్నీ తిరుపతి రుయాకు తరలించి వైద్యం అందిస్తున్నారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్టు వైద్యులు చెప్పారు.